

## కంబోడియాలో ఎలుకలకు డిమాండ్

ఇతర మాంసాహార ధరలు పెరగడంతో ప్రస్తుతం కంబోడియాలో ఎలుక మాంసానికి విపరీతంగా డిమాండ్ ఏర్పడింది. మామూలుగా ఇదివరకూ ఇక్కడ పశు మాంసానికి ఎక్కువ డిమాండ్ ఉండేది. దాని ధర పెరగడంతో ప్రస్తుతం ఇక్కడ ప్రతీ హోటల్ మెనూలోనూ అల్లం మసాలా దట్టించిన రుచికరమైన ఎలుక వంటకాలదే అగ్రస్థానం. అక్కడి పిల్లలకు కాస్త డబ్బు సంపాదించడానికి ఇదో మార్గంగా మారింది. చాలా మంది పిల్లలు తమ ఇళ్ళ మూలల్లో వెతికి వెతికి ఎలకల్ని పట్టుకుని, వాటిని మార్కెట్లో అమ్మి వేణ్ణీళ్ళకు చన్నీళ్ళుగా కుటుంబానికి డబ్బు సంపాదిస్తున్నారు. ప్రస్తుతం కంబోడియా ప్రక్క దేశం వియత్నాంకు కూడా ఎలుకల్ని ఎగుమతి చేస్తోంది. రోజుకి ఈ రెండు దేశాల మధ్యా ఒక టన్ను బరువున్న ఎలుకలు ఎగుమతి అవుతున్నాయట!

## పక్షి ఆర్తనాదాలు



న్యూజెర్సీలో ఒక ఇంటి నుంచి వస్తున్న ఆర్తనాదాలు చివరకు ఆ ఇంటి పెంపుడు పక్షివని తేలాయి. ఒక ఆడ గొంతు నిరంతరాయంగా ''హెల్ప్ మి! హెల్ప్ మి!'' అని అరుస్తూండటంతో ఇరుగు పొరుగు కలిసి పోలీసులకు ఫోన్ చేశారు. పోలీసులు వచ్చి తలుపు కొట్టారు. ఎవరూ తీయకపోవడంతో బద్దలు కొట్టుకు లోపలికి వెళ్ళారు. అప్పుడు తేలింది అంత కష్టంలో ఉన్న అమ్మడు ఈ మైనా అని! కాసేపటికి మార్కెట్ నుండి తిరిగి వచ్చిన యజమానురాలు డెలియోన్ ఈ హంగామా అంతా చూసి ఆశ్చర్యపోయింది. ఈ మైనా ఇలా ఇంటి మీదకు గొడవ తేవడం ఇది మొదటి సారి కాదట. ఐదు సంవత్సరాల క్రితం ఒక సారి పసి బిడ్డడిలా ఏడవటం మొదలు పెట్టిందట. ఏడుపు ఎంతకీ ఆగకపోవడంతో ఇంట్లో ఎవరైనా పసిబిడ్డను వదిలి వెళ్లిపోయారేమోనని సందేహించి పక్కింటి వాళ్ళు అధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణం కొందరు శిశు సంరక్షణాధికారుల బృందం అక్కడ ప్రత్యక్షం! అసలు దీనికిలాంటి మాటలు ఎలా వచ్చాయంటే, ''ఇది టీవీ ఎక్కువ చూస్తుంది'' అంటూ సమాధానమిచ్చింది డెలియోన్ నవ్వుతూ.

## 'సరసి' కత

# రిటర్న్ గిఫ్ట్

వైశంపాయనుడింటికి అశ్వద్ధామ గారు భార్యా సమేతుడై వచ్చి కొడుకు పెళ్లి శుభలేఖ ఇచ్చి తప్పకుండా రావాలన్నారు. వైశంపాయనుడి మొహం వెలిగిపోయింది. కోటీశ్వరుడు తనింటికి వచ్చి పిలిచినందుకు.

పెళ్లికి బయల్దేరే ముందు భార్య సుబ్బాయమ్మగారు అడిగింది. ''ఏం గిఫ్టు కొందాం'' అని. ''గిఫ్టా పాడా? అక్షింతలు వేసొద్దాం చాలు. గొప్ప వాళ్లకు మనం ఏమిచ్చినా ఆనదు'' అన్నాడు వైశంపాయనుడు. సుబ్బాయమ్మగారు అయిష్టంగానే వెళ్లింది పెళ్లికి.

పెళ్లి బ్రహ్మాండంగా చేశారు. భోజనాలు, ఏర్పాట్లు ఇంకా బ్రహ్మాండంగా వున్నాయి. ''గొప్ప వాళ్లింట్లో పెళ్లంటే ఇలా వుంటుంది మరి'' అన్నాడు వైశంపాయనుడు భార్యతో.

వచ్చేసేటప్పుడు ''వెళ్లొస్తామండీ'' అంటే, ''మంచిదండి థాంక్స్'' అన్నారు



అశ్వద్ధామ గారూ, భార్య.

వైశంపాయనుడికి వొళ్లు మండిపోయింది. ''గొప్పవాళ్లు గొప్పవాళ్లు అంటారు. పెళ్లికొచ్చిన వాళ్లకి రిటర్న్ గిఫ్టు ఇవ్వాలన్న మినిమమ్ కర్టెసీ కూడా లేదు. ఛీ!'' అంటూ ధుమధుమలాడిపోయాడు దార్లో.

''మనం గిఫ్టు ఇస్తే, తిరిగి వాళ్లిచ్చే దాన్ని రిటర్న్‌గిఫ్ట్ అంటారు. మనం ఏమీ ఇవ్వకుండా వాళ్ల నుంచి గిఫ్టు ఆశించడానికి సిగ్గుండక్కర్లా?'' అంటూ ముక్క చీవాట్లు పెట్టింది సుబ్బాయమ్మగారు.

వైశంపాయనుడు సైలెంటయిపోయాడు.

*